# నాగరాజీయమ్

12

రాయసం వెంకట్రామయ్య

నాగరాజుకి సంగీతం వచ్చనీ, వాడు తబలా బాగా వాయిస్తాడనీ నాకు చిన్నప్పట్నించీ తెలుసు. వాడు కచేరీలు చేసినవాడుకాదు. ఇంటి దగ్గరో, భజనలు చేసేటప్పుడో వాయించేవాడు.

బాల గంగాధరంగారి కొడుకు వెంకటేశ్వరరావు మంచి గాయకుడని పేరొచ్చింది. చాలా కేసెట్లు కూడా విడుదల చేశాడు. కానీ వాడి కచేరీలు బాగా అరుదే. కేసెట్లకి బాగా ప్రచారం వచ్చింది.

''నాగరాజూ! వెంకటేశ్వర్రావు మన ఊళ్లో పాడుతున్నాడ్రా. వాడి పాటలు విన్నావుగా?'' అన్నాను.

''మీ ఇంట్లోనే విన్నాను. అతడ్ని నేనెప్పుడూ కలవలేదు. పాట కచేరీ కూడా వినలేదురా. మన ఊళ్లో ఎప్పుడు పాడుతున్నాడు?''

''ఆదివారం సాయంత్రం ఆరుగంటలకి. వాడూ నేనూ చాలా స్నేహితులం. వాళ్లది రాజమండ్రి. మా బావతో చదువుకున్నాడు. వాడు శ్రోతల్ని చూస్తే పాడ్లేడు. వాడిదదో పద్ధతి'' అన్నాను.

''చిత్రంగా వుందే. శ్రోతల్ని చూడకుండా ఎలా పాడతాడు?'' అడిగాడు నాగరాజు.

''అదో కథ. ముందర మా ఇంటికి నడు'' అని మా ఇంటికి తీసుకొచ్చాడు వాడ్ని. మా ఆవిడెందుకో రుసరుసలాడుతోంది. వాతావరణం అనుకూలంగా లేదని నెమ్మదిగా ''తినడానికేమైనా వుందా?'' అన్నాను.



''మీరు ఊరంతా తిరిగి అడ్డమైన వాళ్లని వెంట పెట్టుకురండి. నేను వండి వడ్డిస్తుంటాను. గానుగ ఎద్దులా ఉంది నా బ్రతుకు'' అంది శ్రీమతి.

నేను తెల్లజెండా చూపించి నాగరాజుతోపాటు బైటకెళ్లి కాఫీ తాగాను. వాడు అరటిపండు తింటానన్నాడు. అప్పుడు చెప్పాను వాడికి వెంకటేశ్వర్రావు కథ.

వెంకటేశ్వర్రావు పాడతాడని మొదట్లో ఎవరికీ తెలీదు. ఎవరి ముందైనా పాడమంటే సిగ్గుపడేవాడు. నీళ్ల గది అంటే స్నానాల గదిలో వీడి గానకచేరీ మొదలెట్టేవాడు. గదిలో ప్రవేశించగానే ఆలాపన మొదలు. దాదాపు అన్ని మేళకర్త రాగాల్లో పాడుతుండేవాడు. ఒక్కొక్కప్పుడు రెండు గంటలుపైగా పట్టేది వీడి స్నానానికి. మూలమూల రాగాల్లో కూడా కృతులు

## సంగీతముతో...

పాడేవాడు. ఈమధ్య సినిమా పాటలు కూడా ప్రాక్టీసు చేశాడని విన్నాను. వీడి బాధ పడలేక వాళ్ల నాన్నగారు ఓ పడకగదిని స్నానాల గది కింద మార్పు చేయించాడు వీడి చిన్నతనంలో. నీళ్లబిందె, ఇత్తడి చెంబు కనబడితే పాట మొదలెట్టేవాడు. మనిషి అలికిడైతే మానేసేవాడు.

ఒకమాటు ఓ పెద్ద సంగీత విద్వాంసుడు వీళ్లింటికేదో పనిమీద వచ్చి వాళ్ల నాన్నగారితో మాట్లాడుతోండగా వీడి స్నానం, పాట ప్రారంభించాడు. రీతిగౌళ రాగంలో ''నవరత్న విలాస విభవ ప్రదే, నతజన శుభప్రదే బహువరదే జయ జయ'' అనే ముత్తుస్వామి దీక్షితులు కీర్తన పాడితే ఆయన స్నానాల గది ముందు చతికిలబడి అరగంటపైగా విన్నాడుట. ఆయన కళ్లనీళ్లు చూసి బాధ పడుతున్నాడేమోననుకుంటే తీరా ఆయన తనివి ఆనందభాష్పాలనీ, పాట గాడ్ని చూస్తేగానీ వెళ్లననీ చెప్పాడుట.

వెంకటేశ్వర్రావు స్నానాలగదిలో ఓ మద్దెల వ్రేలాడకట్టాడు. ఘటం బదులుగా ఇత్తడి బిందె ఉపయోగించి పాడటం అలవాటు చేసుకున్నాడు.

వీడి ఖ్యాతి ఆ నోటా ఈ నోటా నలుగురికీ తెల్సిపోయింది. హెచ్ఎమ్‌వీ గ్రామ్‌ఫోన్‌ను వాడు కూడా రెండు రికార్డులు విడుదల చేశాడుట. తర్వాత తర్వాత క్యాసెట్‌లు వచ్చాక మంచి ప్రచారం వచ్చింది. వీడు స్నానాలగదిలో పాడుతుంటే వీడికి తెలీకుండా మైకు పెట్టి రికార్డు చేశారు మొదట్లో. ఇప్పుడు వీడికి చెప్పే అలా చేస్తున్నార్ట.

చన్నీళ్లు పోసుకుంటుంటే పాప్ మ్యూజిక్, తలంటి పోసుకుంటే హిందుస్తానీ రాగాలు పాడతాడు.

వీడెక్కడైనా కచేరీ చేస్తే ప్రేక్షకులకు వెన్ను చూపిస్తూ కూర్చుంటాడు. వీడికి ముందుగా ఓ నీళ్లబిందె, ఇత్తడి చెంబు, సబ్బు, తువ్వాలు పెట్టి వుంచుతారు. వీడు నీళ్లు కొంచెం కొంచెం పోసుకుంటూ పాడతాడు. నీళ్లు వొంటిమీద కాక గొంతుకలో పోసుకుంటూ పాడ్తాడు.

కథంతా విని నాగరాజు అడిగాడు ''ఒరేయ్! వెంకటేశ్వర్రావుగారు ఇవ్వాళ కూడా అలాగే పాడతాడా?''

''అంటే?'' అన్నాను.

''మరేంలేదు. స్నానాలగదిలా స్టేజీ మీద ఏర్పాటు చేసి పాడతాడా?''

''అవును. నువ్వూ, నేనూ కచేరీకి వెళ్తున్నాం. సరేనా?''

''సరేగానీ భలే తమాషాగా వుందే వింటుంటే'' అన్నాడు నాగరాజు. తిరిగి అడిగాడు ''ప్రక్క వాయిద్యాలెవర్రా?''

''రఘుపతి రాఘవ రాజారామ్ ఫిడేలు, సింగవరపు వీరనరసింహం ఘటం, మరింకెవరున్నారో తెలీదు''

''అది రాజారామ్ పూర్తి పేరే మిత్రా?'' అని అడిగాడు నాగరాజు.

''వాడి పూర్తి పేరు రఘుపతి రాఘవ రాజారామ్ పతీత పావన సీతారామ్. వాళ్ల నాన్నగారు గాంధీగారి శిష్యుడు. స్వతంత్రోద్యమంలో ఆస్తంతా పోయిందిగానీ దేశ భక్తిపోక వీడికి ఆ పేరు పెట్టారు'' అన్నాను.

నేనూ, నాగరాజు సంగీత కచేరీకి ఓ అరగంట ముందుగానే వెళ్లాం. వెంకటేశ్వ్రరావుని నాగరాజుకి పరిచయం చేశాను. ఇద్దరూ ఒకళ్లని చూసి మరొకళ్లు సిగ్గుపడిపోయారు. నాగరాజుకి సంగీతం వచ్చుని డోలు వాయించగలడనీ చెప్పేసరికి వెంకటేశ్వ్రరావు ముఖం చాటంతైంది.

నాగరాజూ, నేనూ రెండో వరుసలో కూర్చున్నాం. కచేరీ కొంత ఆలస్యంగా మొదలైంది. మృదంగం వాయించేవాడి కోసం ఆపారు. తీరా చూస్తే వాడు గిరజాల కేశవరావు. వాడు సిల్కు లాల్చీ వేశాడు. దానిపైన అందరికీ కనబడాలని, పాతకాలం పెద్ద ముత్తయిదువలు వేసుకునే కాసులపేరులాటిది వేసుకున్నాడు. గ్లాస్కో పంచె లుంగీలా కట్టాడు. ముఖం మీద విభూది పెట్టాడు.

''ఏమిటి వీడేమైనా అరవవాడా?'' అని అడిగాడు నాగరాజు.

''వీడు తెలుగువాడే. పూలకుండీల్లో కూడా గోంగూరే పెంచుతాడు. కానీ అరవ్వాడిలా డ్రెస్ వేసుకుంటాడు. మంచి మంచి నగలు పెట్టుకుంటాడు'' అన్నాను.

కచేరీ ప్రారంభం అవుతూనే వెంకటేశ్వ్రరావు తన స్నానపు గదిలో కూర్చున్నాడు స్టేజీమీద. వాడికీ మిగతా కళాకారులకూ మధ్యలో తెరలు కట్టారు. వాటిపైన కుళాయిలోంచి నీళ్లు వస్తున్నట్లు ఓ బొమ్మ వేశారు. ఓ నీళ్ల బిందె, చెంబు పెట్టారు గాయకుడికి దూరంగా. ఒకవేళ ఆవేశంలో స్నానం మొదలుపెడతాడేమోనని కామోసు.

నాటరాగంలో గణపతి స్థుతితో కచేరీ ప్రారంభమైంది. నాగరాజు తాళం వేస్తున్నాడు. ముందు వరుసలో ఒకళ్లిద్దరు ముందుకీ, వెనక్కీ బాగా ఊగుతున్నారు. మరొకడు తల ఆడిస్తున్నాడు. వేరొకడు తొడమీద చేత్తో బాదుకుంటున్నాడు. ఇంతలో ఉన్నట్టుండి నాగరాజు ''తాళం తప్పుతోందిరా. మృదంగంవాడు తన ఇష్టమొచ్చినట్లుగా వాయిస్తున్నాడు'' అన్నాడు. వీడన్న మాటలకి అందరూ మావొంకే చూశారు.

''ఊరుకో. గట్టిగా అరిస్తే అందరూ వింతగా చూస్తారు. తాళం తప్పినా, తప్పకపోయినా మనదేం పోయింది'' అన్నాను. మరో నిముషానికి నాగరాజు నా వీపు గోకి ''తాళం మళ్లీ తప్పింది. గిరజాలవాడు ముంచేస్తున్నాడ్రా'' అన్నాడు.

ఈలోగా వెంకటేశ్వ్రరావు తెర వెనుక నుండి వీరనరసింహానికేదో సంజ్ఞ చేశాడు. నరసింహం వీరావేశంతో ఘటాన్ని బాదాడు. గిరజాల కేశవరావు వైపు కోపంగా చూశాడు వాడు. ఆ కీర్తన పాడేలోగా నాగరాజు హాల్లోంచి బైటకెళ్లిపోయాడు.

తర్వాత శృతిపాడే ముందు తెరవెనుక వీర నరసింహం వెంకటేశ్వరరావు మాట్లాడుకున్నారు. గిరజాల కేశవరావుకేదో చెప్పారు. వాడు లెక్క చేసినట్టు లేదు.

నాగరాజు నా ప్రక్కన లేకపోయేసరికి తాళం సరిగా వుందో, లేదో నాకు తెలియలేదు. వెంకటేశ్వరరావు భైరవిరాగంలో 'కామాక్షి అనుదినము మరవక, నేనీ పాదములే దిక్కనుచు నమ్మితిని' అనే శ్యామశాస్త్రి కృతి చాలా బాగా పాడాడనిపించింది. మృదంగం బాగా వాయించాడు కేశవరావు.

నేను కచేరీ అయ్యాక వెంకటేశ్వరరావు కోసం మెట్ల దగ్గర ఎదురు చూస్తుంటే కనబడ్డాడు నాగరాజు.

''ఎక్కడికి పోయావింతసేపూ?'' అని అడిగాను.

దానికి వాడు ''మరేంలేదు. నేను తెర వెనక్కి వెళ్లి తాళం తప్పుతోంది, మృదంగం సరిగ్గా వాయించడం లేదని చెప్పాను. వీరనరసింహం 'నీకు వాయించడం వచ్చా?' అని అడిగాడు. 'ఫర్వాలేదు వాయించగల్ను' అన్నాను. నాకో మైకు ఏర్పాటుచేసి తెరవెనుకే కూర్చోపెట్టారు. గిరజాల కేశవరావు మైకు స్విచ్చి ఆపేసిన సంగతి వాడికి తెలీనట్టుంది'' అన్నాడు.

''పోనీ వాడ్ని తీసేసి నీచేతే వాయించచ్చు కదురా?'' అన్నాను.

''వాడికి కచేరీ ఏర్పాటు చేసినవాళ్ల రికమండేషన్ ఉందిట. అందుకని వాడ్ని వీళ్లేం చేయలేరు'' అన్నాడు నాగరాజు.

**(వచ్చేవారం... పెళ్లి పెద్ద)**

★


